పన్నుల వసూళ్లపై ఫోకస్

- గ్రామాల్లో వందశాతం పూర్తిచేసేలా అధికారుల కార్యాచరణ
- ఈ నెల 31వరకు గడువు

అర్వపల్లి, నాగారం : గ్రామపంచాయతీల్లో ఇంటి పన్నుల వసూళ్లపై అధికారులు దృష్టి పెట్టారు. 100 శాతం పన్నులు వసూలు చేయడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించారు. మార్చి 31 ఆర్థిక సంవత్సరం గడువు దగ్గర పడుతుండటంతో 100శాతం పన్నులు వసూలు చేసేందుకు పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టారు.

జాజిరెడ్డిగూడెం మండలంలో ఇలా..

జాజిరెడ్డిగూడెం మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీల పరిధిలో 2024–2025 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ నెల 31 వరకు రూ.36,41,694 వసూలు చేయాలనే లక్ష్యం పెట్టుకోగా ఇప్పటి వరకు రూ.21,21,276 వసూలు అయ్యాయి. అంటే 56శాతం మేర పన్నులను వసూలు చేశారు. అడివెంలలో రూ.1,42,784, అర్వపల్లిలో రూ.3,96,994, బొల్లంపల్లిలో రూ.87,171, జాజిరెడ్డిగూడెంలో రూ.2,96,471, కాసర్లపహాడ్‌లో రూ.84,029, కోడూరులో రూ.1,34,663, కోమటిపల్లిలో రూ.29,885, కొమ్మాలలో రూ.1,25,451, కుంచమర్తిలో రూ.48,994, లోయపల్లిలో రూ.46,035, నాణ్యతండాలో రూ.41,310, పర్సాయపల్లిలో రూ.2,24,385, రామన్నగూడెంలో రూ.1,27,224, సూర్యనాయక్‌తండాలో రూ.55,186, తిమ్మాపురంలో రూ.1,53,344, ఉయ్యాలవాడలో రూ.68,941, వేల్పుచర్లలో రూ.58,487 చొప్పున పన్నులను ఇప్పటి వరకు వసూలు చేశారు.



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో ఇంటిపన్ను వసూలు చేస్తున్న బిల్ కలెక్టర్ నాగయ్య

నాగారం మండలంలో ఇలా..

నాగారం మండలంలో మొత్తం 14 గ్రామపంచాయతీలు ఉండగా వీటి పరిధిలో ఇంటి పన్ను బకాయిలు రూ.38,75,938 ఉన్నాయి. కాగా ఇప్పటి వరకు సుమారు 70శాతం వరకు అనగా రూ.26,57,318 వసూలు చేశారు. మిగతా బకాయి ఈనెలాఖరులోపు వసూలు చేయాలనే లక్ష్యంతో పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తున్నారు. గ్రామపంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గతేడాది నుంచి నిధులను విడుదల చేయకపోవడంతో ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. పారిశుద్ధ్య నిర్వహణ, ట్రాక్టర్, ట్యాంకర్ నిర్వహణకు అవసరమైన నిధులు లేకపోవడంతో కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు. చిన్న గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలను సైతం చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాల సర్వే పనులతో బిజీగా ఉన్న పంచాయతీ కార్యదర్శులు ఇకనుంచి ఇంటి పన్ను వసూలు చేసేందుకు చర్యలు చేపట్టారు. పన్నుల వసూళ్లలో వెనుకబడిన పంచాయతీలపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు.

పన్నులు వెంటనే చెల్లించాలి



అన్ని గ్రామపంచాయతీల్లో 100శాతం పన్నుల వసూళ్లే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు ఇంటి పన్నులను తప్పనిసరిగా చెల్లించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలి. ఇప్పటి వరకు 56శాతం వసూళ్లను పూర్తి చేశాం. గడువులోపు వందశాతం పన్నులు వసూలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

- గోపి, ఎంపీడీఓ, జాజిరెడ్డిగూడెం

గడువులోగా వంద శాతం వసూలు



మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో వందశాతం పన్నుల వసూళ్లే లక్ష్యంగా చర్యలు చేపట్టాం. పంచాయతీ కార్యదర్శులకు రోజువారీగా పన్నుల వసూళ్లపై టార్గెట్ నిర్ణయించి వసూళ్లు చేస్తున్నాం. మండలంలో ఇప్పటి వరకు 70శాతం వరకు పన్నులు వసూలు అయ్యాయి. మిగిలినవి మార్చి 31వరకు వసూలు చేసి లక్ష్యాన్ని పూర్తి చేస్తాం.

- కె.మారయ్య, ఎంపీడీఓ, నాగారం

అధికారులు అంకితభావంతో పనిచేయాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

మద్దిరాల : ప్రభుత్వ అధికారులు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. అదే విధంగా మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. పని ప్రదేశంలో కూలీలకు వసతులు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ షాపులో యూరియా అధిక ధరకు విక్రయిస్తుండగా సంబంధిత షాపును తనిఖీ చేసి ఫర్టిలైజర్ షాపుపై చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారిని ఆదేశించారు. మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డిని ఆదేశించారు. కుక్కడం గ్రామంలో ఉపాధిహామీ నిధులతో రైతులు నిర్మిస్తున్న పౌల్ట్రీఫాం షెడ్, పశువుల కొట్టాల పనులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మద్దిరాల మండల పరిధిలోని ముకుందాపురంలో హార్టికల్చర్ ద్వారా 8ఎకరాలలో ఏర్పాటు చేసిన మామిడితోటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ హార్టికల్చర్ జిల్లా అధికారి బి.నాగయ్య, తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఏఓ అనిషారూహీ, ఎంఈఓ కాట్ల రవికుమార్, ఏపీఓ గుండు వెంకన్న, ఈసీ చారి, టీఏలు మురళి, అశోక్, ఫీల్డ్ అసిస్టెంట్ శివయ్య, వెంకన్న, వీరస్వామి, శిలివేరు క్రిష్టా, శిలివేరు వెంకన్న, వెన్నెమల్ల భాస్కర్, బీసు రవి, తదితరులు పాల్గొన్నారు.



మద్దిరాలలో ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

నెమ్మికల్ ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రారంభమైన ఇంటర్ పరీక్షలను కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. పరీక్ష జరుగుతున్న విధానాన్ని తనిఖీ చేశారు. కళాశాల ఆవరణలో వృథాగా పడి ఉన్న బెంచీలను స్టోర్ రూంలో భద్రపరచమని కళాశాల యాజమాన్యానికి ఆదేశించారు. మండల వైద్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన మెడికల్ కేంద్రాన్ని పరిశీలించి అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఫ్లయింగ్ స్క్వాడ్ వీడీఎస్ ప్రసాద్, తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్, డీఈసీ అధికారులు జె.కృష్ణయ్య, జి.లక్ష్మయ్య, ఆర్ఐ ప్రదీప్ రెడ్డి ఉన్నారు. కాగా బుధవారం మొదటి రోజు 263 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 17 మంది విద్యార్థులు గైర్హాజర్ అయ్యారని పరీక్ష కేంద్రం ప్రధానాధికారి గునగంటి వెంకటేశ్వర్లు తెలిపారు.

క్లుప్తంగా

బిగ్‌బాస్ ఫేం సందడి



కేఫ్‌ను ప్రారంభిస్తున్న టేస్టీ తేజ

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని పాత మున్సిపాలిటీ వద్ద ఏర్పాటు చేసిన ఓ కేఫ్‌ను బుధవారం రాత్రి బిగ్‌బాస్ ఫేంలు టేస్టీ తేజ, శుభశ్రీ రాయ్ గురు ప్రారంభించారు. వారు వస్తున్నట్లు తెలియడంతో ప్రజలు భారీగా వచ్చారు.

వీడ్కోలు సమావేశం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రబాబు

నాగారం : విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బల్గూరి చంద్రబాబు అన్నారు. బుధవారం మండల పరిధిలోని పసునూర్ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన 2024–25 పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలు ఎంచుకొని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. పోటీ ప్రపంచంలో విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించినప్పుడే చదివిన చదువుకు సార్థకత లభిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలరాజు, సోమసుందర్, రవి, లింగరాజు, కృష్ణ, నాగరాజు, వీరన్న, అశోక్, సాధన, రాధా, హసీనా, సుమలత, తిరుమల, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పంచాంగం ఆవిష్కరణ




శ్రీవిశ్వావసు నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరిస్తున్న సుబ్రహ్మణ్యమూర్తి

తుంగతుర్తి : మండల కేంద్రానికి చెందిన డాక్టర్ ఎర్ర హరికిషన్ రచించిన శ్రీ విశ్వావసు నామ సంవత్సర, గంటల పంచాంగాన్ని విజయవాడలో ప్రముఖ పంచాంగ కర్త, అంతర్జాతీయ జ్యోతిష్య శాస్త్రవేత్త డాక్టర్ శ్రీ తిరుమలశెట్టి సుబ్రహ్మణ్యమూర్తి చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో గుజ్జ సురేష్‌కుమార్, రెడ్డెబోయిన సైదులు, చౌడవరపు నాగరాజు, కైరంకొండ రమేష్, జలగం పురుషోత్తం, ఎల్లబోయిన భిక్షం, గోపగాని మధుకర్, నర్సయ్య, మధుసూదన్, అనిల్‌కుమార్, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నూతనకల్ : అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజులతరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సామూహిక అక్షరభ్యాసం, అన్నప్రసాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బాలింతలు, చిన్నారులు, గర్భిణులకు ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఎఫ్ ఉపాధ్యక్షుడిగా కోడి మహేష్ కుమార్



ఆత్మకూర్ (ఎస్) : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అనుబంధ ఉద్యోగ సంఘం మాదిగ ఉద్యోగుల సమైక్య (ఎంఈఎఫ్) జిల్లా ఉపాధ్యక్షుడిగా మండల పరిధిలోని ముక్కుడుదేవులపల్లి గ్రామానికి చెందిన కోడి మహేష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గట్టికల్లు గ్రామానికి చెందిన పత్తేపురం లింగయ్య ఎన్నికయ్యారు. బుధవారం జిల్లా కేంద్రంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల పరిధిలోని నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న మహేష్ కుమార్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికవడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హాస్టళ్లను సందర్శించాలి

అర్వపల్లి : వసతి గృహాలను వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు వారినికోసారి సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించాలని మండల వైద్యాధికారి డాక్టర్ భూక్య నగేష్ కోరారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి ఆశా కార్యకర్త 100శాతం గర్భిణీ నమోదు కార్యక్రమాన్ని చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో హెల్త్ సూపర్‌వైజర్ లలిత, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి నగేష్

శ్రమ దోపిడీ లేని సమాజాన్ని నిర్మించాలి



చివ్వెంల : సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



సూర్యాపేట: క్రీడా వస్తువుల గదిని ప్రారంభిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి

చివ్వెంల : శ్రమ దోపిడీ లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం కుడకుడ గ్రామంలో ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గౌరవంగా జీవించడం మా హక్కు అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు తంగళ్ల వెంకట చంద్ర, మద్దెల జ్యోతి, జూలకంటి విజయలక్ష్మి, బచ్చలకూరి మంగమ్మ, పిండిగా నాగమణి, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

ఆట వస్తువులు అందించడం అభినందనీయం

సూర్యాపేట : విద్యార్థులకు ఆట వస్తువులు అందించడం అభినందనీయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. బుధవారం సూర్యాపేట మున్సిపాలిటీ పరిధి 11వ వార్డు రాయినిగూడెంలోని మల్లు వెంకటనరసింహారెడ్డి మెమోరియల్ పాఠశాలలో మేకనబోయిన సందీప్ జ్ఞాపకార్థం తల్లిదండ్రులు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మేకనబోయిన శేఖర్–సైదమ్మల సహకారంతో రూ.లక్ష 20వేల విలువల గల ఆట వస్తువులను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఆట వస్తువులను సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శేషగాని శ్రీనివాస్‌గౌడ్, హెచ్‌ఎం సిరగాని యాకయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, ఎడ్ల గంగాభవానియాదవ్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, ఎల్గూరి వినోద, ములకలపల్లి రాములు, మట్టిపెల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, వెంకన్న, ధనియాకుల శ్రీకాంత్ వర్మ, నరసింహారావు, వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రజిత తదితరులు పాల్గొన్నారు.

గీత కార్పొరేషన్‌కు అప్పగించాలి

నాగారం : నీరా కేఫ్‌ను రాష్ట్ర ప్రభుత్వం కల్లుగీత కార్పొరేషన్‌కు అప్పగించాలని తెలంగాణ గౌడ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొల్కపురి శ్రీకాంత్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన గీత కార్మికుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు మొగలగాని అనిల్‌గౌడ్, అనంతుల సత్తయ్యగౌడ్, గొడిశాల యాదగిరిగౌడ్, నర్సింగ లింగయ్యగౌడ్, పాదిల శ్రీనుగౌడ్, మాద అశోక్, లింగయ్య, యాదగిరి, మల్లయ్య, సురేష్, నర్సయ్య, శేఖర్, నాగరాజు, హుస్సేన్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

సువెన్ ఫార్మా సేవలు అభినందనీయం



విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ

సూర్యాపేటటౌన్ : విద్యాభివృద్ధి కోసం సువెన్ ఫార్మా కంపెనీ చేసే కార్యక్రమాలు అభినందనీయమని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సువెన్ ఫార్మా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్)లో భాగంగా అక్షర ఫౌండేషన్ ద్వారా సువెన్ ఫార్మా పరిసర ప్రాంత విద్యార్థులకు చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. సువెన్ ఫార్మా కంపెనీ ఎన్నో మెడికల్ క్యాంపులు నిర్వహించిందని, పలు ప్రాంతాల్లో మంచినీటి సౌకర్యం కల్పించిందని వివరించారు. పేద విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బంది పడొద్దనే ఉద్దేశంతో సామాజిక సేవ కార్యక్రమాల్లో భాగంగా చెక్కుల పంపిణీ చేపట్టడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సువెన్ ఫార్మా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ రమేష్ బాబు, జిల్లా అదనపు ఎస్పీ మేక నాగేశ్వరరావు, అక్షర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యాస రామ కుమార్ రెడ్డి, సువెన్ సీనియర్ మేనేజర్ వెంకటరమణ, డిప్యూటీ మేనేజర్ సైదులు, ఫెసిలిటీ మేనేజర్ జీవన్ నాయక్, మహేష్, వివిధ ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు వర్క్‌షాప్

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం విద్యార్థులకు కెర్నల్ మాస్టర్ హైదరాబాద్ వారిచే బుధవారం వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ బి.కిషోర్ కుమార్ మాట్లాడారు. ఎంబెడెడ్ ఫీల్డ్ ఆవశ్యకత, ఇండస్ట్రియల్ ఎంబెడెడ్ బోర్డు ఎస్టీఎమ్ 32పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ముత్యాల రాజు మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగం ఇన్‌చార్జ్ డి.నాగరాజు, అధ్యాపకులు డాక్టర్ ఎస్.నాగేశ్వరరావు, బాలయ్య, టి.శ్రీనివాసు, సరిత, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వివరిస్తున్న రిసోర్స్ పర్సన్

వసతులు కల్పించాలి

అర్వపల్లి : స్యాండ్ టాక్స్ విధానం వల్ల ప్రభుత్వానికి చేకూరుతున్న నిధులతో జాజిరెడ్డిగూడెం గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌ను అభివృద్ధి చేయాలని జిల్లా వినియోగదారుల అసోసియేషన్ అధ్యక్షుడు చొల్లేటి రమణ విజ్ఞప్తి చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఈ విషయమై కలెక్టరేట్‌లో వినతిపత్రం కూడా అందజేసినట్లు చెప్పారు. ఇక్కడి పాఠశాలలో ల్యాబ్, కంప్యూటర్, క్రీడల పరికరాలను ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామంలోని ఇసుక రీచ్ ద్వారా ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతున్నందున, గ్రామంలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

మొదటిరోజు ఇంటర్ పరీక్ష ప్రశాంతం



సూర్యాపేటలోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

తిరుమలగిరి : ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని తిరుమల సహకార జూనియర్ కళాశాలలో 165 మంది విద్యార్థులకు గాను 9 మంది గైర్హాజరు అయ్యారు. మండల పరిధిలోని అనంతారం మోడల్ పాఠశాలలో 176 మంది విద్యార్థులకు గాను 37 మంది ఆప్సెంట్ అయినట్లు పరీక్షల సూపరింటెండెంట్ సంజీవ్‌కుమార్ తెలిపారు.

తుంగతుర్తి : మండల కేంద్రంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్ష బుధవారం పారంభమై ప్రశాంతంగా ముగిసింది. తుంగతుర్తిలోని రెండు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించారు. తుంగతుర్తిలోని గిరిజన గురుకుల కళాశాలలో 217 మంది విద్యార్థులకు గాను 204మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 273 మంది విద్యార్థులకు గాను 264 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు పరీక్ష నిర్వహణ అధికారులు తెలిపారు.

మైనింగ్ పర్మిషన్ రద్దు చేయాలి



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం తొండ గ్రామంలోని సర్వే నంబర్ 98లో మైనింగ్ పర్మిషన్ రద్దు చేయాలని బుధవారం గ్రామస్తులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఇదే సర్వే నంబర్‌లో ప్రభుత్వం రైతు వేదిక, డంపింగ్ యార్డు, క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసిందని తెలిపారు. రూ.330 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పార్కు, భవన నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఇక్కడ మైనింగ్‌కు పర్మిషన్ ఇవ్వడం వల్ల భవనాలు పూర్తిగా దెబ్బతింటాయని, విద్యార్థులు ఇబ్బందులు పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. మైనింగ్ పర్మిషన్లు రద్దు చేయాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సోమనారాయణ, బంగారి, లక్ష్మయ్య, వెంకన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ, పురుష సమానత్వం కోసం పోరాడుదాం



ర్యాలీలో పాల్గొన్న మహిళలు

ఆత్మకూర్(ఎస్) : స్త్రీ పురుష సమానత్వం కోసం పోరాడుదామని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కంచర్ల నర్సక్క అన్నారు. హైదరాబాద్‌లో జరిగే ప్రపంచ అందాల పోటీలను వ్యతిరేకిస్తూ మంగళవారం రాత్రి తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అందాల పోటీలతో మహిళల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, మహిళలను కార్పొరేట్ శక్తులు అణచివేస్తున్నాయని అన్నారు. మహిళల హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతున్న వారిపై ఉప చట్టాలను ఆపాదిస్తూ ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నారని తెలిపారు. మహిళలంతా ఐక్యంగా పితృస్వామిక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8న వాడవాడలా సభలు, సమావేశాలు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వరికుప్పల వెంకట నరసమ్మ, మల్లమ్మ, అఖిల, సునీత, శృతి, మంగమ్మ, నాగమ్మ, రమణ, వెంకటమ్మ, లక్ష్మి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం

నూతనకల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిధిలోని జాల్‌తండా ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులు, అధికారులుగా వ్యవహరించి ఆటకట్టుకున్నారు. ప్రతిభ కనకబర్చిన విద్యార్థులకు ఎంఈఓ రాములు నాయక్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గునగంటి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జాల్‌తండాలో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ వర్క్ బుక్స్ అందజేత



తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లో వర్క్‌బుక్స్‌తో విద్యార్థినులు

అర్వపల్లి : ప్రభుత్వం అందించే కెరీర్ గైడెన్స్ వర్క్‌బుక్‌లను పదవ తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జాజిరెడ్డిగూడెం మండల నోడల్ అధికారి, తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు కుంభం ప్రభాకర్ కోరారు. మండల పరిధిలోని తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం పదవ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ వర్క్‌బుక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆ పుస్తకాల ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూమి ఆక్రమణను అడ్డుకోవాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల పరిధిలోని భక్తాళాపురం గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమణను అడ్డుకోవాలని గ్రామంలోని ఎస్సీ కాలనీవాసులు బుధవారం తహసీల్దార్ లాలుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలోని కమిటీ హాల్ పక్కన ఉన్న ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గ్రామ కార్యదర్శి ఇరుగు రమేష్, మండల యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ నెమ్మాది రఘు, ఎమ్మార్పీఎస్ మండల కమిటీ సభ్యుడు నెమ్మాది సైదులు, బీఆర్‌ఎస్ యువజన నాయకులు గురుస్వామి, నెమ్మాది శ్రీరాములు, గోపాల్దాసు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



పెన్‌పహాడ్: విద్యార్థుల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్ఎం వస్రాం నాయక్



అర్వపల్లి కేజీబీవీలో విద్యార్థినులకు బెడ్ షీట్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ బాలునాయక్

పెన్‌పహాడ్ : విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని నోడల్ అధికారి, ప్రధానోపాధ్యాయుడు వస్రాం నాయక్ కోరారు. బుధవారం మండల పరిధిలోని అనాజీపురం గ్రామంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అన్నామేరి, ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా తల్లిదండ్రులు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగమణి, సురేష్‌కుమార్, ప్రభాకర్, భాస్కర్‌రావు, ధర్మేష్, ఖాజామొహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ బి.బాలునాయక్ అన్నారు. అర్వపల్లిలోని కేజీబీవీలో బుధవారం 200 మంది బాలికలకు బెడ్‌షీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ నాగరాణి, సీఆర్‌టీలు విజయశ్రీ, స్వప్నమేరి, రేణుక, భవాని, అరుణ, ఇందిర, జ్యోతి, స్వాతి, సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

సాంస్కృతిక సారథి కళాజాతా

తిరుమలగిరి : మత్తు పదార్థాలకు యువత బానిస కావొద్దని సాంస్కృతిక సారథి ఉద్యోగుల సంఘం టీమ్ లీడర్ పాలకుర్తి శ్రీకాంత్ కోరారు. బుధవారం గుండెపురి గ్రామంలో కళాజాతా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాన్‌మసాలా, గుట్కా, సారా నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సైదులు, ఉదయ్, నాగరాజు, శంకర్, ఉపేందర్, శ్రీను, మంజుల, రాధ, స్రవంతి, గిరిజ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే చేరాలి

ఆత్మకూర్(ఎస్) : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి పూర్తవుతున్న విద్యార్థులు వచ్చే ఏడాది ఆత్మకూరులోని జెడ్పీహెచ్‌ఎస్‌లోనే చేరాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. బుధవారం ప్రాథమిక పాఠశాలకు వెళ్లి అక్కడి 5వ తరగతి విద్యార్థులకు ఉచితంగా పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లొద్దని, ప్రభుత్వ పాఠశాలలో చేరితే ఉచితంగా దుస్తులు, పుస్తకాలు అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన బోధన అందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు శ్రవణ్ కుమార్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



5వ తరగతి విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

మృతుడి కుటుంబానికి పరామర్శ

చివ్వెంల : వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది, మాజీ సర్పంచ్ జటంగి వెంకటేశ్వర్లు యాదవ్ గత పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబాన్ని బీజేపీ యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వరుణ్‌రావు పరామర్శించారు. మృతుడి చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పేర్వారం లక్ష్మణ్‌రావు, ధరావతు శ్రీనివాస్ నాయక్, జంపాల వెంకటేశ్వర్లు, కాసుల వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

అర్వపల్లి : ఉపాధి హామీ పథకం పనులకు కూలీలు అధిక సంఖ్యలో వచ్చేలా ఉపాధి సిబ్బంది, మేట్లు చూడాలని ఎంపీడీఓ టి. గోపి కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పథకం పనుల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పనులకు వచ్చే కూలీలు వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఓ ఉపేందర్, ఈసీ నగేష్, టీఏ దీపిక, కార్యదర్శి నెహ్రూనాయక్, బిల్ కలెక్టర్ మాగి నాగయ్య, మేట్లు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ